## ఈవారం కథ

# లాటిట్యూడ్

## Latitude

★ పసుపులేటి గీత

**ప్రాక్పశ్చిమాల నడుమ గ్రిల్డ్ చికెన్‌లా ఎరదోరగా వేగుతూ, పక్కకి ఒత్తిగిల్లాను.**


**కుడిపాదం బొటనవేలు చురుక్కుమంది.**

**వేకువ కిరణం తగిలి, నిప్పంటుకున్న ప్రపంచం నా బొటనవేలి మీద దగ్ధమవుతూంది.**

**'...మార్నింగ్...' ఎప్పట్లా మరో విషోదయం!**

చిన్నతనంలో మా ఇంట దక్షిణపు కిటికీ పక్కన నీటిచెలమ ఉండేది. ప్రతి ఉదయమూ దాన్నుంచి తామర తూడులు కిటికీ పైకి ఎగబాకి, మొగ్గల ముద్దులతో నాకు శుభోదయం పలికేవి. ఇప్పుడలా కాదు. చెలమెండిపోయి, హుస్సేన్‌సాగర్ నడిబొడ్డున మల్టీప్లెక్స్ మొలిచింది. దాంతో నా కాళ్ల దగ్గర నివురు కప్పిన నిప్పుల లోయలో సూర్యుడు పీకల్లోతు దిగబడిపోయాడు.

కళ్లు, చెవులు, కాళ్లు, చేతులు, సుఖం, దుఃఖం, మంచీ, చెడూ, ధనిక, పేద, ఆడ, మగ అంటూ అన్నీ ద్వంద్వాలే అయినప్పుడు రెండు



బొమ్మలు: అక్బర్

ప్రపంచాలెందుకు లేవు? ఉంటే ఆ ఆల్టర్నేటివ్ ప్రపంచపు వేకువలన్నీ శీతలోదయాలే అయితే, సూర్యుడు వెన్నెల కురిపిస్తే, చంద్రుడు పెనం మీద ఆమ్లెట్‌లా పొగలు కక్కితే, పక్షులు జలాంతర్గాములయితే, మబ్బులు నేలమీది నుంచి నింగిలోకి చినుకుల తూటాలు కురిపిస్తే, తలనే అంటిపెట్టుకోకుండా ముఖాలకు రెక్కలు మొలిస్తే... మొలిస్తే ... మొలిస్తే ...

'ముక్కు ఉండాల్సిన చోటే ఉన్నందుకు సంతోషించు. కళ్ల నడుమ, పెదవుల పైన ముక్కు ఉన్నందుకు సంతోషించు. అదే ముక్కు నీ పాదాల మధ్యన ఉంటే అడ్డమైన కంపుతో అదెప్పుడో బద్ధలయ్యేది. ఆ ముక్కు నడినెత్తి మీదో, చెవిలోనో ఉంటే నీ యాతన చెప్పతరమా, ఆలోచించు ... ముక్కు ఉండాల్సిన చోటే ఉన్నందుకు సంతోషించు ...' అంటూ ప్రతిసారీ ముక్కుపిండి మరీ నిద్ర లేపుతాడు జాక్ ప్రెలట్స్కీ నన్ను. జాక్ దెబ్బకి ప్రతి ఉదయమూ నేను ముక్కు కోసం తడుముకుంటూ అద్దం దగ్గరికి పరిగెట్టడం షరా మామూలే. అప్పుడు కానీ నాకు గుర్తురాదు, ముక్కు కాదు ...., అసలు నా ముఖమే ఉండాల్సిన చోట లేదని, అదెక్కడుందో కూడా నాకు తెలియదని!

ఆకలిగొన్న గ్లోబల్ సొసైటీకి బ్రేక్‌ఫాస్ట్ టోస్ట్‌గా కొన్ని నైట్‌మేర్స్‌ని, మరికొన్ని డేడ్రీమ్స్‌ని అద్దుకుని కరకరలాడుతూ రుచి రుచిగా నిద్రలేచాను. ఇవాల్టికి రాష్ట్రీయంగా, జాతీయంగా, అంతర్జాతీయంగా నేనేమైనా మెరుగు పడ్డానో, తరుగు పడ్డానో తెలుసుకోవాలనుకుంటుండగానే టీవీ తలుపులు బాదారెవరో. తలుపులు తెరిచీ, తెరవగానే అనాచ్ఛాదితంగా ఉన్న బొడ్డొకటి నోరు తెరిచి ఆవలించింది. హఠాత్తుగా దాన్లోంచి ఒబామా ఊడిపడ్డాడు. సరిగ్గా నిన్న ... ఇరాక్ బూటులోంచి నమిలి ఉమ్మేసిన ఎంగిలి పాన్‌ముద్దలా బుష్ కూడా ఇలాగే ఊడిపడ్డాడు. హమస్ తిరుగుబాటుదారుడొకడు బూటు ట్రిగ్గర్ నొక్కుతూ ఒబామా వెంటపడ్డాడు. ఇద్దరూ ఇక్కడే ఎక్కడో మెదడు మూలల్లో దొంగా, పోలీస్ ఆటాడుతూంటారు.

బ్యాలెట్ బాక్స్‌లో తప్పిపోయిన శిబూ సొరేన్ ఇడియెట్ బాక్స్‌లో తచ్చాడుతున్నాడు. సత్యం ఐదువేల నలభైకోట్ల కాంతివత్సరాల దూరంలో కృష్ణబిలంలో అబద్ధానికి పునరంకితమైంది. నిన్నటిదాకా చెక్కిళ్లని చెక్కేసిన మేకప్ బ్రష్షొకటి మానిటర్ మీద చీపురై ఎడాపెడా చిమ్మేస్తున్నట్టు నటిస్తోంది. దుమ్మురేగిన తెర మసకబారుతోంది. విసుగొచ్చి కాఫీకప్పుతో పాటు మళ్లీ అద్దంలోకి దూరిపోయాను. అక్కడెవరో ఏదో వెదుక్కుంటున్నారు ... ఎవరో ఏంటి నా ముఖం ... ముఖాన్ని వెదుక్కుంటూ నేనే...!

ఇవాళ ఏ ముఖం పెట్టుకుని లోకం ముందు నిలబడాలి?! ఛ... ఛ... ఎప్పుడూ ఇదే సమస్య. ఎన్ని ముఖాలని తెచ్చుకోవడం?! పట్టుమని పదిరోజులైనా ఉండవు కదా. వెంటనే ముడుచుకుపోతాయి. ముఖమన్న తరువాత కాస్త సాగే లక్షణం ఉండాలి. ఎలా తయారు చేస్తారో, ఏవిటో? బతుకంతా ముఖాల్ని కొనుక్కోవడంతోనే సరిపోతోంది. తెల్లవారితే బయటికి వెళ్లాలంటే ఏవిటోగా ఉంటుంది. ఇది నా ఒక్కదాని సమస్య కాదు. అలా రోడ్లోకి వెళ్లి చూడండి. అంగుళానికొకరు చొప్పున మీకలాంటి ముఖాల్లేని మనుషులే కనబడతారు. చాలామంది అదొక సమస్య కాదన్నట్టే ఉంటారు. నాకు మాత్రం బాగా ఇబ్బందవుతోంది. సరైన ముఖం కోసం తిరగని చోటు లేదు. వెతకని అంగడి లేదు. ఇవాళ మళ్లీ వేట మొదలు పెట్టాలి. దేవుడా, ఈసారైనా నా ముఖం నాకు దొరికేలా చూడు తండ్రీ! మొన్నటికి మొన్న మా కొలీగ్ చెబితే యాంటిక్ ఫేసెస్ షాపుకు వెళ్లాను. కానీ మరీ పాత ముఖాలు,

క్లియోపాత్రా ముఖానికి నకళ్ల వంటివి కూడా అమ్ముతున్నారు. ఎప్పటి ముఖాలో ఏమిటో. ఏవైనా జబ్బులు తగులుకుంటే... భయపడి ఏమీ కొనకుండానే వచ్చేశాను.

నిజానికి సిటీలో అలాంటి షాపొకటి ఉండడం బావుంది. ఎందుకంటే రెడీమేడ్, బ్రాండెడ్ ముఖాల వెలలు మండిపోతున్నాయి. అసలే ఆర్థిక మాంద్యం, ఏ ముఖం పెట్టుకుని బ్రాండెడ్ ఫేసెస్ కోసం వెళతాం చెప్పండి?! పోనీ కారుచౌకగా దొరుకుతాయి కదాని హోంమేడ్ ముఖాలు కొందామంటే, చింపిరిజుత్తు, చెక్కిళ్ల నిండా మచ్చలు, దిగులు ముఖాలు ... అబ్బబ్బా .... విరక్తి కలుగుతుంది. బ్రాండెడ్ ఫేసెస్ మాటంటేనే జడుపుగా ఉంది. నాలా అత్తెసరు జీతాల్తో బతికే మధ్యతరగతి జనానికి లోకల్ బ్రాండ్ ముఖాలు తప్ప మరో గతిలేదు.

అమీర్‌పేట ఎప్పట్లా జనంతో కుతకుతలాడుతోంది. ఫుట్‌పాత్‌పై నాలుగు చక్రాల బళ్లమీద, చిన్నచిన్న షాపుల అరుగుల మీద చేతిలో పాంప్లెట్స్ పట్టుకొని గాల్లోకి విసుర్తూ , చెవులు చిల్లులు పడేలా 'రండి బాబూ, రండి... రండమ్మా....రండి, యూత్‌ఫుల్ ఫేసెస్... కేవలం ఏడొందలకే. ఒకటి కొంటే నాలుగు ముఖాలు ఉచితం. రండి బాబూ, రండి ... రండమ్మా , రండి' అంటూ కొందరు కుర్రాళ్లు గొంతు చించుకుంటున్నారు. చించుకోకుండానే కాళ్లమీద పడి కన్నీరయ్యే ఖాళీ కడుపు కోసం గొంతు చించుకోక తప్పుతుందా?! ఒక్క క్షణం ఆగి చూశాను. వాళ్లలో కొంతమంది పిల్లల ముఖాలు వేలాడిపోతున్నాయి. మరికొంత మందికైతే ముఖాలే లేవు. సొంత ముఖమన్నది పిల్లల హక్కుల్లో ఒక భాగంగా చూడాలనిపించింది. పాపం, ఇంత చిన్న వయసులోనే ముఖాల్ని కోల్పోతే వాళ్లకిక ఎండిన పేగులు తప్ప ఏం మిగులుతాయి? వాళ్లతో పోలిస్తే నాలాంటి వాళ్ల పరిస్థితే కొంత మెరుగు.



ఇప్పట్లా ముఖాలు కొనుక్కోవాల్సిన అగత్యం లేని రోజుల్లో నేను పుట్టాను. చిన్నతనంలో నాకొక అందమైన ముఖముండేదట. అమ్మ చెప్పేది ... నా కళ్ల పూల రెప్పలు విప్పగానే సౌరభ స్వప్నాలు తొణికిసలాడేవట. చిట్టిముక్కునిండా స్వేచ్ఛావాయువులే నా ఉచ్ఛ్వాస, నిశ్వాసలుగా కదలాడేవట. లేత పెదవుల మీద మాటల పిట్టలు రెక్కలల్లారుస్తుంటే 'ఉంగా ... ఉంగా' అంటూ బంగారు భవిష్యత్తుకు భాష్యం చెప్పేదాన్నట.

నా తెలివైన ముఖమంటే అమ్మకి ఎంతిష్టమో?! కానీ ఏం లాభం, ఎదిగే వయసుతోపాటు నేను కూడా చదువులూ, ఉద్యోగాలూ, కెరీర్, పెళ్లీ, పిల్లలంటూ నా ముఖాన్ని పోగొట్టుకున్నాను. ఏ రోజున ముఖాన్ని పోగొట్టుకున్నానో గుర్తులేదు కానీ, ఆ రోజున అమ్మ నన్ను ముఖం వాచేలా చెడతిట్టింది. 'ఉద్యమాలూ, వంకాయలూ అంటూ నా పరువు బజారుకీడిస్తే ఊరుకోను. నోరు మూసుకుని చదువుకో, లేదంటే కాళ్లు విరిచి, మూల కూచోబెడతా!' అన్న నాన్న బెదిరింపుతో విద్యార్థి ఉద్యమం నుంచి నిశ్శబ్దంగా తప్పుకున్న రోజునా ... 'మన కులమే ...' నంటూ ప్రొఫెసర్ అర్హతకు మించి నాకు మార్కులు వేసినప్పుడు, దాన్నొక విజయంగా నేను అంగీకరించిన క్షణంలోనా.... ఉద్యోగంలో ముందుకెళ్లడం కోసం లేని వినయాన్ని రాని నవ్వుని ముఖానికి బలవంతాన పులుముకున్నప్పుడా... ఇంటి పరువుకు నా ప్రేమను, ప్రేమించిన వాడిని బలిచ్చి, అరేంజ్‌డ్ మ్యారేజ్‌కి ఒప్పుకున్నప్పుడా ... నా స్నేహితుల్లో వ్యభిచారులెవరో, సంసారులెవరో లెక్కలు చెబుతూ నా భర్త చేసిన హెచ్చరికతో స్నేహాల్ని వదులుకుని పూర్తి స్థాయి సంసారిగా మారిన నాడా... ఏమో, సరిగ్గా గుర్తులేదు కానీ, నా ముఖాన్ని కోల్పోయి చాలా కాలమే అయింది. ముఖాన్ని కోల్పోయిన క్షణాన్నే అమ్మ నా ముఖం చూడనంటూ ఈ లోకాన్ని వదిలి వెళ్లిపోయింది. నా ముఖం నాకు దొరికిన తరువాత అమ్మకెలాగైనా నచ్చజెప్పి ఈ లోకంలోకి తీసుకురావచ్చునన్న ఆశతోనే నేనిలా ముఖాల వేటలో పడ్డాను. కానీ ఈ 'ముఖప్రీతి' లోకంలో నా ముఖం నాకు దొరికే ఆశ నానాటికీ సన్నగిల్లుతోంది.

**ఇవాళ ఏ ముఖం పెట్టుకుని లోకం ముందు నిలబడాలి?! ఛ... ఛ... ఎప్పుడూ ఇదే సమస్య. ఎన్ని ముఖాలని తెచ్చుకోవడం?! పట్టుమని పదిరోజులైనా ఉండవు కదా. వెంటనే ముడుచుకుపోతాయి. ముఖమన్న తరువాత కాస్త సాగే లక్షణం ఉండాలి. ఎలా తయారు చేస్తారో, ఏవిఁటో? బతుకంతా ముఖాల్ని కొనుక్కోవడంతోనే సరిపోతోంది.**

రోడ్డు నాలుకలుగా చీలి కొండనాలుకల్లాంటి ఫ్లయ్‌ఓవర్లుగా పొంగుతున్నాయి. రోడ్ల మీద వెహికల్స్ అన్నీ యాంత్రిక మానవులై ఆటోబోట్స్‌గాను, డిసెప్టికాన్స్‌గాను మారిపోయి పరస్పరం తలపడుతున్నాయి. మోకాళ్లతో ఆలోచిస్తూ తలతో నడుస్తున్నాను.

ట్రాన్స్‌ఫార్మర్స్ మధ్య శామ్ విట్వికీనై చిక్కుకున్న నేను ఎలాగైతేనేం 'డ్రీమ్ ఫేస్' అనే ఫేస్ మాల్‌లోకి అడుగుపెట్టాను. షాపంతా కస్టమర్లతో కిటకిటలాడుతోంది. వంద రూపాయల నుంచి వేల రూపాయల ఖరీదు చేసే రకరకాల ముఖాలు ఇక్కడ అమ్ముతారు. ఇంటర్నేషనల్ బ్రాండెడ్ ఫేసెస్‌తో పాటు లోకల్ బ్రాండ్ ముఖాలు కూడా ఇక్కడ దొరుకుతాయి. అందుకే మధ్యతరగతి జనం ఈ మాల్ మీదికి ఎగబడిపోతున్నారు. 'హైఎండ్' అనే లోకల్ బ్రాండ్ అవుట్‌లెట్‌లోకి అడుగుపెట్టాను. అబ్బ, ఎంత ముద్దొచ్చే ముఖాలో! కానీ నా పర్సు అనుమతించిన మేరకు ఓ రెండు ఆర్డినరీ హౌజ్‌వైఫ్ ముఖాల్ని కొనుక్కున్నాను.

షాపులోంచి వచ్చేయబోతుంటే 'మేడమ్, ఒక్కక్షణం. ఈ ప్రోడక్ట్స్ చూస్తారా?' అంటూ సేల్స్ పర్సన్ ఒక ర్యాక్ దగ్గరికి నడిచాడు. ఆ ర్యాక్‌లో కళ్లు, ముక్కులు, రెప్పలు, పెదాలు, చుబుకాలు, చెంపలు ఉన్నాయి. ఇంతవరకు ముఖాల్ని చూడ్డమే తప్ప, ఇలా విడివిడి పార్ట్స్‌ని చూళ్లేదు. 'ఇవి రీసైక్లింగ్ ప్రాసెస్‌లో చేసినవి. మీ దగ్గర పాడైన పాత ముఖాలేమైనా ఉంటే వీటితో వాటిని సరిచేసుకోవచ్చు. ఈ నెలే మార్కెట్లోకి కొత్తగా వచ్చాయి. మీకు ఇంట్రెస్ట్ ఉంటే ట్రై చేయవచ్చు' అని చెప్పాడతను.

ధరలు కూడా రీజనబుల్‌గానే ఉన్నాయి. ఒకసారి ట్రై చేసి చూద్దాం అనుకుని ఒక అరడజను పెదాలు, డజను కనురెప్పలు, ఒక జత కళ్లు కొన్నాను. అన్నింటినీ ఐస్ బాక్స్‌లో సర్ది ప్యాక్ చేసిచ్చారు.

తరువాత ఒకదాని వెంట మరొకటిగా అన్ని అవుట్‌లెట్ల విండో డిస్‌ప్లేని చూసుకుంటూ ముందుకు నడిచాను. హఠాత్తుగా నాకొక కోరిక కలిగింది. కొనలేకపోతే పోయే కనీసం ఒకసారి ముట్టుకుని చూడొచ్చునన్న ఆశతో ఒక ఇంటర్నేషనల్ బ్రాండ్ అవుట్‌లెట్‌లోకి వెళ్లాను. నిజంగా, అంత అందమైన ముఖాలు కూడా ఉంటాయా అనిపించింది. నా భర్త ఇలాంటి బ్రాండ్‌లే వాడతాడు. ఆ మాటకొస్తే మగాళ్లు సాధ్యమైనంత వరకు ఇంటర్నేషనల్ బ్రాండ్ ముఖాల్నే వాడతారు. ఆడవాళ్లు మాత్రం లోకల్‌బ్రాండ్స్‌తో సరిపుచ్చుకుంటారు. 'మిస్ యూనివర్స్', 'మిస్ ఇండియా' ముఖాలు లక్షల్లో ధర పలుకుతున్నాయి. ఎలైట్ వర్గపు స్త్రీల ముఖాల ధర కొంచెం తక్కువే అయినా నాబోటి వాళ్లు కొనగల రేంజిలో మాత్రం లేవు. నా వాలకం కనిపెట్టాడేమో సేల్స్‌బాయ్, 'లో ప్రైస్ ఎలో కావాలంటే, రీసైకిల్ చేసిన ముఖాలున్నాయి. చూస్తారా' అన్నాడు. సరేనని ఆ వైపుగా నడిచాను. ఒక్కో ప్యాకెట్ విప్పి చూపడం మొదలెట్టాడు. 'ఇవి న్యూస్ వాల్యూ ఉన్న ఫేసెస్. డీజెనరేట్ అయ్యే మెటీరియల్‌తో రికన్‌స్ట్రక్ట్ చేశారు' అని చెప్పాడతను. ఒక ఫేస్ చూపించాడు. అవమాన భారంతో, కలలు తెగిన కళ్లకి రెప్పల్ని అటాచ్

చేశారు. ముఖమంతా యాసిడ్ మరకలు, మచ్చలతో ఉందా ముఖం. 'ఇది యాసిడ్ దాడిలో చనిపోయిన స్వప్నిక ముఖం కదా...' నా గొంతులో నాకే తెలియని సన్నని వణుకు. అవునంటూ అతను చాలా క్యాజువల్‌గా అనూరాధ, వరలక్ష్మి, ఆయేషా మీరా, భార్గవి ... ఇలా ముఖం వెంట ముఖం తీసి చూపిస్తున్నాడు. ఇన్ని ముఖాల మధ్య నా ముఖాన్ని వెదుక్కోవాలన్న ఆలోచన అణగారిపోయింది నాలో. ఇక చూళ్లేనన్నట్టు తల ప్పేశాను. ఎందుకో ఇబ్బందిగా అనిపించింది.

ఆ సేల్స్ పర్సన్ నాకేసి ఒక రకంగా చూసి, 'కావాలంటే వీటిని ట్రై చేయవచ్చు' అంటూ షోకేస్ నుంచి రొమ్ముల జతను తీశాడు. 'ఈ ఇంప్లాంట్స్‌కి సర్జరీతో పనిలేదు. జస్ట్ బ్రా మార్చుకున్నట్టే...' అంటూ వెకిలిగా నవ్వాడు.

నాలో మధ్యతరగతి సిగ్గు పరదాలు కదిలి ఛర్రున కోపం నషాళానికంటింది. 'రాస్కెల్' అంటూ లాగిపెట్టి ముఖమ్మీద ఒక్కటిచ్చాను. దెబ్బకి వాడి పెట్టుడు ముఖం నజ్జయింది. అంతే, క్షణంలో అంతా గలాభాగా మారిపోయింది. సెక్యూరిటీ గార్డ్స్ నన్ను బలవంతంగా బయటికి లాక్కెళ్లడానికి ప్రయత్నించారు. నాకు మోచేతుల మీద చిన్న గాయాలయ్యాయి. షాపులో ఆడవాళ్లు పిల్లల్ని తీసుకొని మగాళ్ల వెనుక దాక్కున్నారు.

'స్టుపిడ్ లోవర్‌క్లాస్ నాన్సెన్స్' అంటూ చాలా మంది మొహాలు చిరాగ్గా పెట్టారు. పోలీసులొచ్చారు.

ఇంత గొడవ జరుగుతుందని నేనూహించ లేదు. ఇంత కంగాళీలోనూ నేనొక విషయాన్ని గమనించాను. అందరూ నా వైపు చాలా వింతగా చూస్తున్నారు. వాళ్ల చూపులో ఏదో తెలియని భయం. కొత్తదనం కనిపించింది.

ఇన్‌స్పెక్టర్ నన్ను 'వ్యానులో ఎక్కమ్మా' అన్నాడు. 'నేనెందుకు స్టేషన్‌కి రావాలి. నా పట్ల అసభ్యంగా ప్రవర్తించింది వాడు, వాణ్ణి తీసుకెళ్ల కుండా నన్నెందుకు తీసుకు వెళతారు?' అని ప్రశ్నించాను.

దాంతో ఇన్‌స్పెక్టర్ ఖంగుతిన్నట్టు చూశాడు.

'చూడమ్మా, షాపులో ఇలా అల్లరి చిల్లరగా పరువు తక్కువగా ప్రవర్తించడం పెద్ద నేరం. అందునా ఆడదానివి. ఎదురు తిరిగి ప్రశ్నిస్తున్నావు. ఇది మరీ తీవ్రమైన నేరం. యాంటీ క్వెశ్చన్ లా కింద నిన్ను అరెస్టు చేయక తప్పదు. వ్యాన్ ఎక్కు...' అని గద్దించాడు.

దేశంలో ప్రశ్నని నిషేధిస్తూ ఒక ప్రత్యేక చట్టాన్ని తెచ్చిన విషయం నాకప్పుడు గుర్తుకొచ్చింది. అయినా నాకేమీ భయమనిపించలేదు. ఏదో తెలియని సంతోషంతో నా ఒళ్లు, మనసు పత్తి పువ్వులా తేలిక పడినట్టనిపించింది.

వ్యాన్‌లో ఎక్కి కూర్చున్నాను. తోపిడిలో కింద పడ్డానేమో, దుమ్మంటుకుని ఒళ్లంతా చీదరగా ఉంది. జుట్టు రేగిపోయినట్టుంది. జుట్టును సరి చేసుకోడానికి బ్యాగ్‌లోంచి అద్దం తీసి చూసుకున్నాను. నా కళ్లముందొక సుందర స్వప్నం బొమ్మ కట్టినట్టుంది. ఇన్నాళ్ల నా అన్వేషణ ఫలించింది. కలో, నిజమో అర్థం కాలేదు.

నా ముఖం ... నా ముఖమే ... సహజంగా ... సహజాతి సహజంగా ... పాలు, పూలు, వెన్నెలా రంగరించి చేసిన అందమైన ముఖం అద్దంలో కనిపించేసరికి అప్పుడర్థమైంది అందరూ నా వంక ఎందుకంత వింతగా చూశారో! సహజమైనదే దైనా అదిప్పుడు మనుషుల్ని భయపెడుతోంది. అనుమానాల్ని రేపుతోంది. సొంత ముఖమన్నది ఇప్పుడిక్కడ నేరమైంది. ఏ శిక్ష అయినా పడనీ, నాకేమో ప్రపంచాన్ని జయించినంత సంతోషంగా ఉంది.

నా ముఖం నాకు వచ్చేసింది. నాది కాని ముఖంతో, నాది కాని జీవితంతో, నాది కాని మనసుతో బతికే అగత్యం లేదు నాకిక!

వ్యాన్ స్టేషన్‌కి ఎప్పుడు చేరిందో తెలియదు. నన్నో మూల బెంచీ మీద కూర్చోబెట్టారు. నా భర్త

**సొంత ముఖమన్నది ఇప్పుడిక్కడ నేరమైంది. ఏ శిక్ష అయినా పడనీ,నాకేమో ప్రపంచాన్ని జయించినంత సంతోషంగా ఉంది. నా ముఖం నాకు వచ్చేసింది. నాది కాని ముఖంతో, నాది కాని జీవితంతో, నాది కాని మనసుతో బతికే అగత్యం లేదు నాకిక!**

సెల్‌నెంబర్ అడిగారు. ఇచ్చాను.

వర్తమానం వెళ్లింది.

అతనొచ్చేస్తాడు ...

ఈ గొడవ కన్నా నా అందమైన ముఖమే తనని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. సొంత ముఖంతో వెలిగిపోవడమన్న అరుదైన అందాన్ని తొలిసారిగా చూస్తాడతను. నన్నెలా ప్రేమించాలో ఈ క్షణంలో తెలుసుకుంటాడు. నేనెంత అమూల్యమైన దాన్నో ఇప్పుడు గుర్తు పడతాడు. అలా గుర్తుపట్టిన క్షణంలోనే అతనికీ సొంత ముఖమొచ్చేస్తుంది. ముఖం లేని ఈ మనుషుల మధ్య మేమిద్దరమే నిజమైన మనుషులుగా నిలబడతాం. ప్రపంచం మా నుంచి జీవితపు విలువల్ని నేర్చుకుంటుంది. నా ఊహలకు అంతు లేకుండా ఉంది.

తనొచ్చాడు, ఇన్‌స్పెక్టర్ ఎదురుగా కూర్చున్నాడు. వాళ్లేం మాట్లాడుకుంటున్నారో నాకు సరిగ్గా అర్థం కాలేదు. నేను కూర్చున్న బెంచీ కొంచెం దూరంలో ఉంది. నా భర్త (పెట్టుడు) ముఖం ఆందోళనగా కనిపించింది. బతిమలాడుకుంటున్నట్టు కనిపించింది. అతనింత వరకూ నా వైపు కన్నెత్తి చూడలేదు. కొంచెం సేపు వాళ్లిద్దరి మధ్యా మాటలు నడిచాయి. కాసేపటికి నా భర్త ముఖంలో కాస్త రిలీఫ్ కనిపించింది.

అప్పుడు చూశాడతను.

నేనూహించినట్టే ఆశ్చర్యపోయాడు.

కానీ అదెంతో సేపు నిలబడలేదు. రమ్మన్నట్లు సైగ చేసి, ముభావంగా ముందుకు నడిచాడు. స్టేషన్ నుంచి ఆటోలో వచ్చినంత సేపూ అతనొక్కసారి మళ్లీ నా ముఖం కేసి చూడాలని ఎంతగా కోరుకున్నానో చెప్పలేను. కానీ దించిన తల ఎత్తకుండా పక్కన నేను లేనట్టుగా, మాటామంతీ లేకుండా ఉండిపోయాడు.

చీకటిలావా అగరుపొగలా నెమ్మదిగా కమ్ముకుంటోంది. ఆటోలో మౌంట్ ఫ్యూజీ ఎర్రగా గడ్డ కట్టింది. ఇంటికొచ్చాం.

ఇంట్లో అల్లర్నీ, ఆటల్నీ మరచిన బాల్యం బుద్ధిగా కెరీరిస్టిక్ హోంవర్క్ చేసుకుంటోంది.

లోపలికి అడుగు పెట్టాను.

నా అందమైన ముఖంతో తొలిసారిగా నా ఇంట్లో అడుగుపెట్టాను. పాదానికి ముఖాన్నే పారాణిగా చేసి నట్టింట తొలి అడుగు ముగ్గు పెట్టాను. అదే క్షణంలో పదివేల డెసిబుల్స్ శబ్దంతో కళ్లు, కలలు బద్దలయ్యేలా నా చెంప ఛెళ్లుమంది.

'పరువు మాలిన గాడిదా, ఎంత పొగరే నీకు... ఆడదానిలా ప్రవర్తిస్తున్నావా? బరితెగించి, ఇలా...' పళ్లు నూరుతూ, పిడికిలి లేపి, మరో దెబ్బ వేయడానికి గాల్లోకి లేచిన అతని చేయి గాల్లోనే



ఆగిపోయింది.

ఆ దెబ్బకి అవకాశమివ్వకుండా అతన్ని బలంగా ఒక్క తోపుతోసి, బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపులు బిగించుకుని మంచమ్మీద వాలిపోయాను. ఓడిగెలిచిన ఆనందం... రేపేమౌతుందన్న బెంగలేదు.

నా తిరస్కారానికి అతని ప్రతిస్పందన ఎంత దారుణంగా ఉన్నా నాకనవసరం. ... వాలిన రెప్పల కింద, రెక్కలు విప్పుకున్న ముఖం... 'వెలుతురు సీమ చివరి అంచు మీద నిలబడి రెండో అడుగు అంధకారంలోనే వేయాల్సి వచ్చినపుడు రెండు పాఠాల్ని నేర్చుకుంటావు. పాదం కింద గట్టి పట్టు దొరికితే స్థిరంగా నిలుచోవడమెలాగో నేర్చుకుంటావు. లేదంటే రెక్కలు విప్పుకుని ఎగరడాన్ని నేర్చుకుంటావు... నాతోరా...' అంటూ జోనాథన్ లివింగ్‌స్టన్ సీగల్ పిలిచింది.

దాని రెక్కల మీద రెక్కలొచ్చిన నా ముఖం విశ్వాంతరాళాల్లోకి స్వప్నించింది. ప్రాక్పశ్చిమాల నడుమ గ్రిల్డ్‌చికెన్‌ఫీనిక్స్‌లోకి అనూదితమైంది.

(జాక్ ప్రెలట్స్కీ, అమెరికన్ కవి. 'జోనాథన్ లివింగ్‌స్టన్ సీగల్' రిచర్డ్‌బక్ రచన. 'ట్రాన్స్‌ఫార్మర్స్' 2007లో స్పీల్‌బర్గ్, మైఖేల్ బే దర్శకత్వంలో వచ్చిన చిత్రం. ఇందులో ఆటోబోట్స్, డిసెప్టికాన్స్ అనే ఎలియన్ రోబోట్లు పరస్పరం తలపడతాయి. 'ఆల్‌స్పార్క్' అనే రోబోట్ శక్తిపై ఆధిక్యత కోసం డిసెప్టికాన్స్, ఆటోబోట్స్ యుద్ధం చేస్తుంటాయి. ఈ యుద్ధంలో శామ్ విట్వికీ అనే యువకుడు అనుకోకుండా చిక్కుకుంటాడు)